సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం | 20 | సెప్టెంబర్ | 2024



గొంతు తడారి.. ఇదో ఎడారి


ఆటలాడి... అలసి సొలసిన క్రీడాకారులకు గుక్కెడు నీరు దొరకడం గగనమైంది. గొంతు తడారి దిక్కులు చూస్తున్నా అక్కడ ఎడారినే తలపిస్తోంది. - 8లో



అది పులి కాదు.. అడవి పిల్లి

దివాన్‌చెరువు శివారు శ్రీరామపురం, రాకీ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలోని తోటల్లోకి బుధవారం రాత్రి చిరుతపులి దూకిందనే ప్రచారంలో నిజం లేదని అధికారి ఎస్.భరణి తెలిపారు. 8లో

2.01 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 2,01,882 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షునిగా బాపూజీ



కలెక్టర్ మహేష్ కుమార్‌కు మొక్క ఇస్తున్న బాపూజీ తదితరులు

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా మద్దాల బాపూజీ ఎన్నికయ్యారు. ఈ నెల 16న అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో 22 ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు పాల్గొన్న సభలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాపూజీ తెలిపారు. రాష్ట్రంలో 21 లక్షల ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల్లో అతి పెద్దదైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. ఉద్యోగుల ప్రతినిధిగా అందరి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఏపీజీఈఏ సంఘానికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ మహేష్ కుమార్‌ని కలసి కోరగా సుముఖత వ్యక్తం చేశారన్నారు. రామచంద్రపురం తహసీల్దార్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ గోపాలకృష్ణ, రీ సర్వేయర్ డీటీ మహాలక్ష్మి నాయుడు, ఇతర ఉద్యోగ సంఘ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో పీఈటీ మధు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.రాజశేఖర్ గురువారం తెలిపారు. రామచంద్రపురం జూనియర్ కళాశాలలో ఈ నెల 19న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–19 టేబుల్ టెన్నిస్ పోటీలో మట్టపర్తి గ్రీష్మశ్రీ, ఇల్ల మనోజ్ఞ నాగదీప్తి, దంగేటి విద్యాసాయిశ్రీ, కొల్లు సత్య శ్రీవాణి, బొక్కా హేమలక్ష్మిదుర్గలు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే ఈ నెల 18న కాకినాడలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–14, 17 విభాగాల్లో చొల్లంగి జాహ్నవి శివదుర్గ, వంటపాటి భరణి, కుప్పాల ప్రణయ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వీరు త్వరలో విజయవాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న క్రీడాకారులను, వారికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీ ఆసు వెంకట సూర్యమధులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, విత్తనాల ఇంద్రశేఖర్, ఉప సర్పంచ్ బంధన రాంబాబు, పీఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందు అభినందించారు.

జిల్లా కార్యాచరణను రూపొందించాలి



అమలాపురం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: స్వర్ణాంధ్ర 2047 విజన్ ముసాయిదాకు అనుగుణంగా వచ్చే ఐదేళ్లకు జిల్లా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం ఆయన అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీరబ్‌కుమార్ మాట్లాడుతూ ఐటీ శాఖ ద్వారా వెబ్‌సైట్‌లో ప్రదర్శించిన స్వర్ణాంధ్ర 2047 విజన్ ముసాయిదా డాక్యుమెంట్‌కు అనుగుణంగా వివిధ వర్గాల నుంచి వివిధ స్థాయిల్లో ప్రజాభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. దీనికి అనుగుణంగా మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్‌ను ఈ నెలాఖరు నాటికి సిద్ధం చేయాలన్నారు. ఉచిత ఇసుక పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అమలాపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మహేష్ కుమార్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు, పవన్‌లు కలసి ఒకే వేదికపై నుంచి ఇచ్చిన హామీలు

అంతన్నారు.. ఇంతన్నారు!

ముమ్మిడివరం, రాజోలు వారాహి సభల్లో పవన్ వాగ్దానాలు



ఐ.పోలవరం మండలం సలాదివారిపాలెంలో కోత బారిన భూములు

అంబాజీపేట ఎన్నికల సభ

చంద్రబాబు హామీలు

- పి.గన్నవరం నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న గోదావరి నదీ కోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్‌ల నిర్మాణాలు చేపడతాం.
- వరదల సమయంలో కె.ఏనుగుపల్లి వద్ద, ఎదురుబిడియం కాజ్‌వేలు ముంపుబారిన పడకుండా వంతెనలు నిర్మిస్తాం.
- అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా సాగు, తాగునీరు అందిస్తాం.

ప్రస్తుత పరిస్థితి

- తాజా వరదలకు పి.గన్నవరం, ముమ్మిడివరం, అయినవిల్లి, మామిడికుదురు, ఐ.పోలవరం, కపిలేశ్వరపురం మండలాల్లో నదీ కోత తీవ్రత మరింత పెరిగింది.
- ఎదురుబిడియం కాజ్‌వే, కె.ఏనుగుపల్లి రహదారి మరోసారి ముంపుబారిన పడింది.
- అప్పనపల్లి ఎత్తిపోతల ఊసేలేదు. ఈ వంద రోజుల్లో వీటికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించడం కాని, కనీసం వీటి నిర్మాణాలపై ఆరా తీయడం కాని చేయలేదు. స్థానిక టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు త్వరలోనే పూర్తి చేయిస్తామనే హామీలూ ఇవ్వలేదు.

పవన్ హామీలు


- కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ)ని కోనసీమకు తీసుకువస్తాం. కొబ్బరి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. నైపుణ్యాభివృద్ధి ద్వారా చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం. కొబ్బరిలో నాణ్యమైన మొక్కలను స్థానికులకు అందేలా చర్యలు తీసుకుంటాం.
- కోనసీమ రైల్వేలైన్ త్వరితగతిన పూర్తి చేస్తాం.

ప్రస్తుత పరిస్థితి

- సీడీబీ రాష్ట్ర కార్యాలయాన్ని కోనసీమకు మార్పు చేయడం పెద్ద విషయం కాదు. కేంద్రంలో భాగస్వామ్యంగా ఉన్నందున ఒక వినతిపత్రం ఇస్తే చాలు. కానీ ఇప్పటి వరకూ ఆ ప్రయత్నం చేయలేదు.
- కొబ్బరి పరిశ్రమల ఏర్పాటు, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై కదలిక లేదు. కొబ్బరి కొత్త వంగడాలు సృష్టించి రైతులకు అందించేందుకు కనీసం 15 ఏళ్ల నుంచి 20 ఏళ్ల సమయం పడుతోంది.
- కోనసీమ రైల్వే లైన్ రెండో అలైన్‌మెంట్ భూ సర్వేకు టీడీపీ, జనసేన స్థానిక నేతలే అడ్డుపడుతున్నారు. వారి వల్ల ఈ రైల్వే లైన్ మరింత ఆలస్యం కానుంది.

సాక్షి, అమలాపురం: ఒకటా రెండా... ఎన్నికల ముందు టీడీపీ అధినేత హోదాలో చంద్రబాబు.. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు ఓటరు తడిసి ముద్దయినట్టు హామీల వర్షం కురిపించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో.. అంతకుముందు పార్టీ పరంగా నిర్వహించిన 'వారాహి... బాబు ష్యూరిటీ... భవిష్యత్‌కు గ్యారంటీ' సభలలో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్...

- చంద్రబాబు, పవన్ హామీలన్నీ హుష్ కాకి
- నదీ కోత నివారణకు ప్రతిపాదనలు శూన్యం
- సఖినేటిపల్లి- నరసాపురం వంతెన ఎక్కడో?
- కోకోనట్ బోర్డు కార్యాలయం తరలింపు మాటేలేదు
- వంద రోజులు దాటినా కానరాని చర్యలు



కోనసీమలో కొబ్బరి తోటలు

సూపర్ టెన్ పథకాలను వల్లివేయడమే కాకుండా.. జిల్లాను అభివృద్ధి పథకంలో తీసుకు వెళ్తామని చెప్పారు. అంతే కాకుండా రోడ్లు.. వంతెనలు.. ప్రాజెక్టుల విషయంలో వరాలు కురిపించారు.

వంతెన పనులు చేపట్టాలి



సఖినేటిపల్లి- నరసాపురం మధ్య గోదావరి నదిపై ఎప్పటి నుంచో ప్రతిపాదనలకే పరిమితమైన వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలి. ఈ వంతెన నిర్మాణానికి ఎందరో ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేశారు. అదిగో ఇదిగో అంటూ ఇప్పటి వరకూ కాలయాపన చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలి.

–ముత్యాల శ్రీనివాసరావు, మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, మోరిపోడు, సఖినేటిపల్లి మండలం

నదిలో ఎకరం కలిసిపోయింది



నాకు ప్రభుత్వం ఎకరం భూమి ఇచ్చింది. మొత్తం భూమి నదీగర్భంలో కలిసిపోయింది. ఇక్కడ ఉన్న నివాసం కూడా నదీ కోతలో కొట్టుకుపోయింది. ప్రభుత్వం అన్నంపల్లిలో ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నాను. నదీ కోతతో పరాయిపంచన ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం నదీ కోత నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– సలాది సత్యనారాయణ, సలాదివారిపాలెం, ఐ.పోలవరం మండలం

కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటింది. ఈ సమయంలో అద్భుతాలు చేయకపోయినా కనీసం ఇచ్చిన హామీలకు కార్యరూపం దాల్చే ఒక్క పనికూడా పట్టాలెక్కించకపోవడం విమర్శలుకు దారితీస్తోంది.

సార్వత్రిక ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచీ వివిధ సందర్భాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ' పేరుతో మండపేట నియోజకవర్గంలో మండపేట, ఏడిద, కొత్తపేట నియోజకవర్గ పరిధిలో రావులపాలెం, అమలాపురం నియోజకవర్గంలో పర్యటించారు. పవన్ కళ్యాణ్ వారాహి సభల పేరుతో ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సభలు నిర్వహించారు. ఎన్నికల ముందు చంద్రబాబు మరోసారి మండపేట, రావులపాలెం, రామచంద్రపురంలో పర్యటించగా, పవన్ రాజోలు, రామచంద్రపురంలో సభలు నిర్వహించారు. బాబు, పవన్‌లు కలిసి పి.గన్నవరం నియోకజవర్గ పరిధి అంబాజీపేట, అమలాపురంలో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. తొలుత సూపర్ సిక్స్, తరువాత


ప్రతి చేతికీ పని.. ప్రతి చేనుకూ నీరు

ఎన్నికల ముందు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటన సందర్భంగా పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీల్లో కొన్ని..

- నదీ పరివాహక ప్రాంతంలో ఇసుకను ఉచితంగా అందించి భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తాం.
- కల్లుగీత కార్మికుల నుంచి వృత్తి పన్ను వసూలు చేయకుండా వారు ఉచితంగా కల్లు గీసుకునే వెసులుబాటు కల్పిస్తాం.
- సఖినేటిపల్లి- నరసాపురం వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయిస్తాం.
- కోనసీమను టూరిజం హబ్‌గా మారుస్తాం.

ప్రస్తుత పరిస్థితి

- కూటమి ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీ అట్టర్ ప్లాప్ అయ్యింది. ఇసుక ర్యాంపులు, స్టాక్ పాయింట్లు ఉన్న రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో 18 టన్నుల (యూనిట్ల) ఇసుక రవాణాతో కలిపి ప్రస్తుతం రూ.20 వేల నుంచి రూ.23 వేల వరకూ అవుతోంది.
- మరో పదిహేను రోజుల్లో కొత్త మద్యం పాలసీ తెస్తున్నారు కాని కల్లుగీత కార్మికుల నుంచి వసూలు చేసే వృత్తి పన్ను మాత్రం రద్దు చేయలేదు.
- సఖినేటిపల్లి- నరసాపురం వంతెన నిర్మాణ పనుల్లో ఎటువంటి కదలిక లేదు. ఇదే సమయంలో రామరాజులంక వద్ద జాతీయ రహదారిలో భాగంగా వంతెన వస్తున్నందున ఈ వంతెన నిర్మాణం ఇక లేనట్టేననే ప్రచారం జరుగుతోంది.
- కోనసీమ టూరిజం హబ్ మాటే కూటమి ప్రభుత్వం ఎత్తడం లేదు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



రైతులకు ఉపయోగకరంగా ఉండేలా కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డును అంబాజీపేటకు తీసుకువస్తానని అంబాజీపేటలో పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. జిల్లాను పరిశ్రమల సీమగా తీర్చిదిద్ది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, కొబ్బరి రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూత ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడుస్తున్నా హామీల ప్రస్తావనే లేకుండా పోయింది. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

– కుసుమ శ్రీనివాసరావు, రైతు, అంబాజీపేట

ఉమ్మడిగా పది పథకాల గురించి చెప్పడమే కాదు.. జిల్లాలో రోడ్లు, వంతెనలు, పలు ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేస్తామని, ఆ బాధ్యత తమదేనని హామీలు వర్షం కురిపించారు. అవేంటంటే..



సఖినేటిపల్లి- నరసాపురం రేవులో పంటు ప్రయాణం



ఎదురుబిడియం కాజ్‌వే వరద నీట మునగడంతో పడవపై రాకపోకలు

అక్రమ ఆక్వా చెరువులు తొలగించాలి



అక్రమ ఆక్వా సాగు వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో అక్రమ ఆక్వా చెరువులను తొలగించాలని, ఆక్వా చెరువులపై ఎన్జీటీ తీర్పు అమలు చేయాలనే డిమాండ్లతో ఆ గ్రామస్తులు గురువారం ర్యాలీ నిర్వహించారు. దీరికి రాజోలు నియోజకవర్గ పరిరక్షణ చైతన్య సమితి, మానవ హక్కుల వేదిక, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, మహిళలు మద్దతు పలికారు. తొలుత వారంతా గ్రామంలోని 16 కాళ్ల మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి తీర ప్రాంత గ్రామాల మీదుగా కేశవదాసుపాలెం వరకూ ఈ ర్యాలీ చేశారు. సీఆర్‌జెడ్ పరిధిలోని ఆక్వా సాగును నిలుపుదల చేయాలని, పర్యావరణాన్ని, మానవ మనుగడను ప్రశ్నార్థకం చేసిన విధ్వంసకర అభివృద్ధిని వ్యతిరేకించాలని, సాగు భూముల మధ్య ఆక్వా సాగును అరికట్టాలని, ఆక్వాకల్చర్ యాక్ట్‌కు అనుగుణంగా లేని చెరువులను తక్షణం తొలగించాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. గతంలో తీరంలో విస్తారంగా వేరుశెనగ, కొబ్బరి, సరుగుడు సాగు జరిగేవని, ప్రస్తుతం జల కాలుష్యం వల్ల కూరగాయల మొక్కలు కూడా పెరిగే అవకాశం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుల్లో వాడే రసాయనాలతో జల, వాయు కాలుష్యం తలెత్తి పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడిందని వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు ఉప్పుమయమై కొబ్బరి, తాడి చెట్లు, సరుగుడు తోటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని అన్నారు. ప్రజాప్రతినిధులు, మహిళలు, నాయకులు, పరిరక్షణ చైతన్య సమితి సభ్యులు, మానవ హక్కుల వేదిక సభ్యులు, సీపీఐ నాయకులు, బీఎస్పీ నాయకులు, జంతువులు, పక్షులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేదిక.. వద్దిక

- రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అసౌకర్యాలను మరచి.. సంస్కరణలా..?
- జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో సమస్యల తిష్ట
- చర్చనీయాంశమైన రెడ్ క్లాత్, వేదికల ఎత్తివేత నిర్ణయం
- రాచరిక వ్యవస్థ రద్దు పేరిట ప్రభుత్వ అనాలోచిత చర్యలు
- ఇక సాధారణ అధికారిగా రిజిస్ట్రార్‌కు కుర్చీ



రిజిస్ట్రార్ కోసం రెడ్ క్లాత్‌తో ఉన్న వేదికను తొలగించిన తర్వాత..



అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



రిజిస్ట్రార్ అధికారికి సాధారణ స్థితిలో ఏర్పాటు చేసిన కుర్చీ, టేబుల్

అమలాపురం టౌన్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తిష్ట వేసిన అనేక అసౌకర్యాల పరిష్కారానికి చొరవ చూపని ప్రభుత్వం, ఎలాంటి ఫిర్యాదులు లేకుండానే ఆయా కార్యాలయాల్లో రిజిస్ట్రార్ల రెడ్ క్లాత్, స్టేజీలను రాచరిక వ్యవస్థ పేరిట తొలగించిన వ్యవహారం ప్రజల్లో ఆసక్తికరంగా మారింది. తొలుత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత, కనీస వసతుల్లేకపోవడం, కరెంట్ బిల్లుల బకాయిలు, కార్యాలయాల నిర్వహణ గ్రాంట్లు ఇవ్వకపోవడం, అద్దె భవనాల్లో నిర్వహణ.. ఇలా అనేక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా, అక్కరకు రాని సంస్కరణలు చేయడం విడ్డూరంగా ఉందని చర్చించుకుంటున్నారు. కోర్టులో న్యాయమూర్తులకు ఉండేలా ఉన్న వేదికలను ప్రభుత్వం తొలగించడంపై ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రార్ కార్యాలయ యంత్రాంగం కూడా ఈ కొత్త విధానంపై పెదవి విరుస్తోంది. జిల్లాలో ఉన్న 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రార్ల రెడ్ క్లాత్, వేదికలను కూల్చి, వారికి సాధారణ కుర్చీ, టేబుల్ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అసౌకర్యాలు ఇవీ..

జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పదింటికి సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లోనే అరకొర వసతులు, అసౌకర్యాలతో నడుస్తున్నాయి. అల్లవరం, అంబాజీపేట, మలికిపురం, రావులపాలెం ఇలా అనేక కార్యాలయాలు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. అన్ని కార్యాలయాల్లో దాదాపు 90 శాతం సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ఉదాహరణకు.. జిల్లా కేంద్రం అమలాపురంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 14 మంది సిబ్బంది అవసరం కాగా, కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లతో ప్రభుత్వానికి దండిగా ఆదాయాన్నిచ్చే కార్యాలయం ఇలా ఉండగా, కొన్ని రిజిస్ట్రేషన్లు మాత్రమే ఉండే అల్లవరం కార్యాలయానికి తగిన సిబ్బంది ఉన్నా, వారికి పూర్తిగా పని ఉండడం లేదు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలను సంస్కరించకుండా ప్రభుత్వం రాచరిక వ్యవస్థను దూరం చేద్దామనే ఆలోచన సరికాదన్న వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే ఉన్న సమస్యలను పరిష్కరించకుండా, సంస్కరణల పేరుతో రిజిస్ట్రార్ కార్యాలయాలను మార్పులు చేయడాన్ని ప్రజలు, ఆయా కార్యాలయాల సిబ్బంది తప్పుపడుతున్నారు.

సమస్యలు కోకొల్లలు

జిల్లా కార్యాలయాల్లో చాలా వరకూ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు, సరైన కుర్చీల సౌకర్యాలు లేవు. పైపెచ్చు ఆన్‌లైన్ ద్వారా జరిగే రిజిస్ట్రేషన్లకు తరుచూ అనివార్యమయ్యే సర్వర్ సామర్థ్యం సక్రమంగా లేదు. ఇలాంటి ప్రధాన సమస్యలనూ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అలాగే రిజిస్ట్రేషన్లు వేగవంతమయ్యేలా ఈసీల నకళ్లు ఇవ్వడం, కార్యాలయాల వద్ద దళారుల ప్రమేయం వంటి సమస్యలెన్నో ఉన్నాయి. ముఖ్యంగా రిజిస్ట్రార్ కార్యాలయాలకు విద్యుత్ బిల్లుల బకాయిలు దండిగా ఉన్నాయి. కార్యాలయాల నిర్వహణ ఖర్చులకూ ప్రభుత్వం గ్రాంట్లు ఇవ్వడం లేదు. ఉదాహరణకు.. కార్యాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, పేపర్లు, ఇంక్ కేట్రిజ్‌లు, ఫర్నిచర్ వంటి సౌకర్యాలనూ కల్పించడం లేదు. కొన్ని కార్యాలయాల్లో కొందరు రిజిస్ట్రార్లే సొంతంగా ఈ ఖర్చులను భరించడం గమనార్హం. అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ విద్యుత్ బకాయిలు రూ.రెండు లక్షల వరకూ పేరుకుపోయాయి.

ఇలాంటి వేదిక సమంజసమే..

కోర్టుల్లో న్యాయం, అన్యాయం నిర్ధారణపై జడ్జీలు విచారణ చేసినట్లే.. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా రిజిస్ట్రార్లు ఆస్తుల రిజిస్ట్రేషన్ల సమయంలో ఇరు పక్షాల కక్షిదారులు, సాక్షులను విచారించాల్సి ఉంటుంది. ఆస్తి యాజమాని చనిపోయిన తర్వాత దాఖలయ్యే వీలునామా విషయంలో కూడా రిజిస్ట్రార్ కోర్టు తరహాలోనే విచారణ జరపాలి. రిజిస్ట్రేషన్ల సమయాల్లో సబ్ రిజిస్ట్రార్లపై పలు సందర్భాల్లో రాజకీయ, దళారీ వ్యవస్థ తదితర వాటి నుంచి ఒత్తిళ్లుంటాయి. గొడవలు జరిగి సమస్యలు తలెత్తే అవకాశమూ ఉంటుంది. ఇవన్నీ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంబంధిత అధికారి సాధారణ కుర్చీలో కూర్చుని విధులు నిర్వర్తిస్తే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని ప్రజలతో పాటు, ఆయా కార్యాలయాల సిబ్బంది కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో రెడ్ క్లాత్‌తో కోర్టుల తరహాలో ఉండే వేదికల వల్ల రిజిస్ట్రార్లంటే ఓ గౌరవం ఏర్పడి, ఆయన జోలికి వచ్చేందుకు ఎవరూ సాహసించ లేరు. పాత విధానమే సమంజసమన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక కల్పనకు సిద్ధమైతే, అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు అండ్ కో లేనిపోని అభ్యంతరాలు లేవనెత్తారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో.. రాచరిక వ్యవస్థ పేరిట రిజిస్ట్రార్లు కూర్చునే వేదికలనే మార్పులు చేస్తుండే మినహా, ప్రజలకు రిజిస్ట్రేషన్లు వేగమయ్యేలా ఆలోచన చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

డెంగీతో బాలిక మృతి

శంఖవరం: స్థానికంగా వెన్నెల వనజ (3) డెంగీ జ్వరంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శంఖవరం ప్రభుత్వాసుపత్రి వైద్యుడు ఆర్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుండని రక్త పరీక్షలు చేయించగా, డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వివరించారు. జ్వరం ఎక్కువగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించామని కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందన్నారు.

రైల్వే ఆదాయంలో సామర్లకోటకు 8వ స్థానం

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైల్వే స్టేషన్లలో సామర్లకోటకు ఆదాయంలో 8వ స్థానం సాధించింది. రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధుల మంజూరులో భాగంగా 30 రైల్వే స్టేషన్‌ల్లో ప్రయాణికులు, ఆదాయ వివరాలను రైల్వే కమిటీ సేకరించినట్లు అధికారులు గురువారం తెలిపారు. రాష్ట్రంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్రథమ, శ్రీకాళహస్తి 30, రాజమహేంద్రవరం 4, కాకినాడ 11, తుని 29వ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఇక్కడ 2023–24లో రిజర్వేషన్ టిక్కెట్ల ద్వారా 8,63,004 మంది ప్రయాణించగా, రూ.52,35,87,551 ఆదాయం వచ్చిందన్నారు. అదేవిధంగా 15,95,150 మంది సాధారణ ప్రయాణికుల ప్రయాణంతో రూ.13,81,80,065 ఆదాయం సమకూరిందన్నారు.

పశువుల అక్రమ తరలింపు అడ్డగింపు

కొవ్వూరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని గురువారం విశ్వ హిందూ పరిషత్ సభ్యులు స్థానిక గామన్ ఇండియా బ్రిడ్జి వద్ద అడ్డుకుని కొవ్వూరు పట్టణ పోలీసులకు అప్పగించారు. కంటైనర్ మాదిరిగా ఉన్న ఈ లారీలో చుట్టూ మూసివేసి పైకప్పు కొంత భాగం ఓపెన్‌గా ఉంచి ఏకంగా 53 పశువులను తరలిస్తున్నారు. మూగజీవాల తరలింపులో ఏవిధమైన నిబంధనలు పాటించలేదు. పాయకరావుపేట నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఈ పశువులను తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

గొంతు తడారి.. ఇదో ఎడారి

- కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో దుస్థితి
- పాడైన వాటర్ ప్లాంట్
- నీటి కోసం క్రీడాకారుల పాట్లు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల సందర్భంలోనూ అంతే


డీఎస్‌ఏలో మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటలాడి... అలసి సొలసిన క్రీడాకారులకు గుక్కెడు నీరు దొరకడం గగనమైంది. గొంతు తడారి దిక్కులు చూస్తున్నా అక్కడ ఎడారినే తలపిస్తోంది.. కనీస సౌకర్యాలు లేక, ఎవరూ పట్టించుకోక ఏళ్లకాలంగా ఇబ్బంది తరుముతూనే ఉంది. ఇదేదో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరబడినట్టే. జిల్లా కేంద్రం, అందులోనూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాకు అతి కీలకమైన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో దుస్థితి. జలం.. మనిషి ఎంతో అవసరం. రోజూ కనీసం 3 నుంచి 5 లీటర్ల నీరు తాగాలనేది వైద్య నిపుణుల మాట. సాధారణ వ్యక్తుల కంటే క్రీడాకారుల జీవన శైలి కాస్త భిన్నం. అందుకే వారు నీరు ఎక్కువగా తీసుకోవాలని చెబుతుంటారు. అయితే కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నీటి కోసం పాట్లు పడాల్సి వస్తోంది. ఇక్కడకు రోజూ వందలాది సంఖ్యలో క్రీడాకారులు వచ్చి వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందుతుంటారు. వీరితో పాటు పోలీస్, ఇన్‌కం ట్యాక్స్, ఆర్మీ, నేవీ తదితర ఉద్యోగాల కోసం శారీరక పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు, వాకర్స్ కూడా వస్తుంటారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికలు, పోటీలు నిర్వహించే రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్రీడాకారులు డీఎస్‌ఏలోనే ఉంటారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో చలికాలంలోనూ ఎండలు అధికమయ్యాయి. తాగునీటి అవసరాలూ పెరిగాయి. అయితే డీఎస్‌ఏకు వివిధ అంశాలపై వస్తున్న వారు గుక్కెడు నీటి కోసం బయటకు పరుగులు తీయాల్సి వస్తోంది. తాగుదామంటే గుక్కెడు నీరు దొరకక ఇబ్బంది వెంటాడుతోంది. ఏళ్ల కిందట డీఎస్‌ఏలోని మినరల్ వాటర్ ప్లాంట్ పాడైంది. తాగునీరు సౌకర్యం ఉందని చెప్పుకోవడానికి ఒక చేతి పంపును ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. వెయ్యి మంది క్రీడాకారులకు ఈ ఒక్క పంపు ఏవిధంగా సరిపోతుందని క్రీడా సంఘాల ప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. అవుట్‌డోర్ ఫీల్డ్‌లో హాకీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, ఇండోర్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, టీటీ, రెజ్లింగ్, స్విమ్మింగ్, స్క్వాష్‌లో శిక్షణ పొందుతున్న వారు, రోజూ ఫిట్‌నెస్ వ్యాయామాలు చేసిన తరువాత తప్పకుండా నీటిని తాగాలి. కానీ వారు తెచ్చుకున్న బాటిల్‌లో నీరు అయిపోతే ఇంటికి వెళ్లే వరకూ గొంతు ఎండాల్సిందే.

ఆదాయం వస్తున్నా..

ఆదాయ పరంగా నెలకు ఒక్క డీఎస్‌ఏ షాపింగ్ కాంప్లెక్స్ నుంచే రూ.3 లక్షలు, ప్లే అండ్ ప్లే విధానంలో మరో రూ.2 లక్షలు ప్రతి నెలా వస్తున్నాయి. అయినా తాగునీటి ప్లాంట్‌ను బాగు చేయడానికి చర్యలు తీసుకోకపోవడంపై క్రీడాకారుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఇబ్బంది ఉన్నా భరించాల్సిందే..



నేను మూడేళ్లుగా డీఎస్‌ఏలో అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. తాగునీటి సౌకర్యం లేక ఇంటికి వెళ్లి నీరు తాగాల్సి వస్తుంది. అప్పటి వరకూ ఎంత దాహం ఉన్నా భరించాల్సిందే. చాలా ఇబ్బంది పడుతున్నాం.

– ఉదయ్‌కుమార్, అథ్లెటిక్స్ క్రీడాకారుడు

ఇంటి నుంచే తెచ్చుకుంటూ..



నేను మూడేళ్లుగా జిల్లా క్రీడా మైదానంలో జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నాను. ఇంటి నుంచి తెచ్చుకున్న బాటిల్‌లో నీరు అయిపోతే ఇంతే సంగతులు. మళ్లీ నీరు పట్టుకుందామంటే నీటి సౌకర్యం లేదు. ఇలాగైతే శిక్షణ ఎలా పొందగలం.

– శషాంక్, జిమ్నాస్టిక్ క్రీడాకారుడు

శాశ్వత పరిష్కారం చూపాలి



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో వివిధ క్రీడా అసోసియేషన్లు, ఎస్‌జీఎఫ్‌ఐ, శాప్, ఖేలో ఇండియా జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపికలు, పోటీలు జరిగినప్పుడు తాగునీరు సౌకర్యం కల్పించాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–వి.రవిరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు


ఈ పాత చేతిపంపు ఒక్కటే ఆధారం

పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన పెంచాలి


శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: పంచాయతీ రాజ్ వ్యవస్థపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు పూర్తి స్థాయిలో అవగాహన పెంచాలని విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లోని అధికారులకు మూడు రోజుల పాటు పంచాయతీరాజ్ విధులపై నిర్వహించిన ముగింపు శిక్షణలో గురువారం ఆయన పాల్గొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన పెరిగితే ఆయా మండలాలకు జిల్లా పరిషత్తు నుంచి ఎక్కువ నిధులు తీసుకువచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తారని తెలిపారు. గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉండే విధంగా చేయాలని ఆయన సూచించారు. అప్పుడే ప్రగతి సాధ్య పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమల్లో స్థానిక యువతకు తప్పని సరిగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే విషయాన్ని తెలియజేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య కొంత మేరకు పరిష్కారం అవుతుందని చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో నేర్చుకున్న అంశాలపై మండల స్థాయి అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రాత పరీక్ష నిర్వహించి, శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముగింపు శిక్షణలో ఫ్యాకల్టీలు జీఎస్‌ఆర్ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తూ పట్టుబడిన బాలికలు

గోకవరం: గంజాయి అక్రమ రవాణాలో అమాయక బాలికలు బలైపోతున్నారు. గోకవరంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు బాలికలను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ కథనం ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు గోకవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇద్దరు బాలికలను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు బ్యాగుల్లో సుమారు రూ.1.53 లక్షల విలువైన 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరికి చెందిన వారు. అక్కడి జోగ్స్ వద్ద కొనుగోలు చేసి హర్యానాకు చెందిన రేణుకకు సరఫరా చేస్తున్నారని గుర్తించామని ఎస్పీ అన్నారు. పట్టుబడిన ఇద్దరూ చదువుకుంటున్నారని, వీరిని రాజమహేంద్రవరంలోని జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఛేదించిన నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

స్వామి కోసం వేలం

దేవరపల్లి: సాధారణంగా వినాయక చవితి ఉత్సవాల్లో స్వామివారి వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదానికి వేలం వేయడం చూస్తుంటాం.. అయితే ఇక్కడ ఓ ఆచారం ఏళ్ల కాలంగా నడుస్తోంది.. అదేంటంటే.. నవరాత్ర ఉత్సవాల్లో నిలిపిన ఉత్సవ విగ్రహానికి వేలం వేయడం, దానిని దక్కించుకున్న పాటదారుడి సారథ్యంలో నిమజ్జన ఊరేగింపు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇది దేవరపల్లిలోని మెరకవీధి వినాయకుడి ఆలయం వద్ద జరుగుతోంది. దీనికి సంబంధించి బుధవారం రాత్రి అక్కడి మండపంలో వినాయక విగ్రహానికి వేలం పాట నిర్వహించారు. ఆ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంపై ఊరేగించి, జలపాతంలో నిమజ్జనం చేయడానికి ఈ పాట జరిగింది. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన వేలం పాట అర్ధరాత్రి వరకూ సాగింది. చివరకు గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు, న్యాయవాది కౌరం అప్పారావు నాయుడు, జీడిపప్పు వ్యాపారి అనిశెట్టి అబ్బు మధ్య గట్టి పోటీ నడిచింది. ఈ పోటీలో అబ్బు రూ.1.63 లక్షలకు పాడగా, కైరం అప్పారావు నాయుడు రూ. 1.65 లక్షలకు విగ్రహాన్ని సొంతం చేసుకున్నారు. ఈ విగ్రహాన్ని శనివారం గ్రామ పుర వీధుల్లో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే స్వామివారికి భక్తులు సమర్పించిన 108 కిలోల లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా, పంచాయతీ సభ్యుడు పచ్చా రాంగోపాల్, దుగ్గిన లీలాకృష్ణ గంగాధర్ నాయుడు రూ.63 వేలకు సొంతం చేసుకున్నారు.


వేలంలో రూ.1.65 లక్షలు పలికిన వినాయక విగ్రహం

ఆంధ్రావాసి అమెరికాలో మృతి

తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

నల్లజర్ల: ప్రకాశరావుపాలేనికి చెందిన ముత్తిన రమేష్ (40) అమెరికాలో మృతి చెందినట్టు గురువారం కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని సోదరుడు నరేష్ అందించిన వివరాల ప్రకారం.. అమెరికాలోని ఇల్‌నాయిస్ రాష్ట్రంలోని కార్‌బొనలే సిటీలోని సదరన్ ఇల్‌నాయిస్ యూనివర్సిటీలో మృతుడు రమేష్ ఎంఎస్ చదవడానికి 2022లో వెళ్లాడు. ప్రయివేటుగా ఉద్యోగం చేస్తూనే చదువుకుంటున్నాడు. అక్కడి సిటిజన్‌తోనే రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆమెతో విభేదించి రమేష్ వేరుగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి భోజనం చేసి వచ్చి రూంలో పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పినట్టు నరేష్ తెలిపారు. సోమవారం, మంగళవారం రమేష్ ఆచూకీ లేకపోవడం, అతని రూం నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతి చెంది ఉన్నాడని, మృతదేహం పాడై ఉందని వివరించారు. అక్కడి పోలీసులే బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుండెపోటు లేదా బ్రెయిన్ హెమరేజ్ వచ్చి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహాన్ని మనదేశానికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మృతుని మేనమామ వైఎస్సార్ సీపీ నాయకుడు కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు తెలిపారు. మృతునికి తండ్రి లేరు. తల్లి పండమ్మ, సోదరులు నాని, నరేష్ ఇక్కడ ఉంటున్నారు.


మృతుడు రమేష్ (ఫైల్)

బాల సుబ్రహ్మణ్యమే నాకు ఆదర్శం

వర్ధమాన గాయకుడు హనుమాన్

అమలాపురం టౌన్: ప్రముఖ సినీ గాయకుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తనకు ఆదర్శమని వర్ధమాన సినీ గాయకుడు త్సవటపల్లి హనుమాన్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన హనుమాన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే పలు సినిమాల్లో పాటలు పాడి వర్ధమాన గాయకుడిగా నిలదొక్కుకుంటున్నారు. సొంతూరుకు వచ్చిన ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని విలేకర్లతో మాట్లాడారు. చిన్నతనంలోనే తన తండ్రి సహకారంతో చెన్నైకి వెళ్లి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యాన్ని కలిశానని చెప్పారు. టీవీ షో స్వరాభిషేకం తదితర పాటల కార్యక్రమంలో బాల సుబ్రహ్మణ్యం సమక్షంలో ఎన్నో పాటలు పాడి ఈ స్థాయికి వచ్చానని వివరించారు. తాను ఇప్పటి వరకూ 30 సినిమాల్లో పాటలు పాడానని చెప్పారు. వెంకీమామ చిత్రంలో 'కోకో కోలా పెప్సీ' పాటకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. డార్లింగ్ సినిమాలో ఓ పాట మంచి ట్రెండ్‌లోకి వచ్చిందని చెప్పారు. స్కంద చిత్రంలో కూడా పాటలు పాడానని తెలిపారు. తాను సినీ సంగీత దర్శకులు తమన్, మణిశర్మ, కోటి వద్ద పనిచేసి పాటలు పాడానన్నారు. దాదాపు రెండు వేల వరకూ స్టేజ్ షోలు చేశానని చెప్పారు. ఇవి కాకుండా హిందీ, మలయాళం, తమిళ భాషల్లో కూడా పలు పాటలు పాడానని తెలిపారు. హిందీ చిత్రం 'లియో'లో 'బ్యాడస్' అనే పాట పాడానన్నాను. తెలుగు చిత్రం 'కీడా కోలా' చిత్రంలో 'దిపిరి దిపిరి' సాంగ్ మంచి పాపులర్ అయ్యిందని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ కోనసీమ శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొలకోటి రంగారావు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత డీఈఈ వెంకటేశ్వరరావు, గాయకుడు హనుమాన్ తండ్రి త్సవటపల్లి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమలాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గాయకుడు హనుమాన్‌కు ఘన సత్కారం జరిగింది. స్థానిక కిమ్స్ వైద్య కళాశాలలో 'బ్యాండ్' పేరుతో గురువారం రాత్రి జరిగిన సంగీతా విభావరిలో కూడా గాయకుడు హనుమాన్ పలు పాటలు పాడి అలరించారు.



అది పులి కాదు.. అడవి పిల్లి

- తోటల్లోకి చిరుత దూకిందనే వార్తల్లో నిజం లేదు
- నిర్ధారించిన అటవీశాఖ అధికారులు


శ్రీరామపురంలోని సీసీ కెమెరాకు చిక్కిన అడవి పిల్లి చిత్రం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు శివారు శ్రీరామపురం, రాకీ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలోని తోటల్లోకి బుధవారం రాత్రి చిరుతపులి దూకిందనే ప్రచారంలో నిజం లేదని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. ఆ ప్రాంతంలో ఒక జంతువు సంచరించిన మాట వాస్తవమేగానీ అది చిరుత పులి కాదని, అడవి పిల్లి అని నిర్ధారించారు. ఆ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో అడవి పిల్లిని గుర్తించామని, పాదముద్రలు కూడా దానివేనన్నారు. గత రాత్రి కోలమూరులో కూడా చిరుతపులి సంచరించినట్టు వచ్చిన ప్రచారం సరికాదన్నారు. అక్కడ కూడా అడవి పిల్లి పాదముద్రలే కనిపించాయన్నారు. ఈ రెండు ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు వచ్చిన ప్రచారాలతో వెంటనే తమ నిపుణుల బృందాలను పంపించి, పరిశీలించామన్నారు. అక్కడ గుర్తించిన పాదముద్రల ప్రకారం అడవి పిల్లిగా నిర్ధారణకు వచ్చామన్నారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల వద్ద చిరుతపులి సంచరిస్తున్నట్టు ఎటువంటి ఆధారాలు లేవన్నారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు.

మరిన్ని ట్రాప్ కెమెరాల ఏర్పాటు

లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో దానిని గుర్తించి, పట్టుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని భరణి చెప్పారు. మొన్నటి వరకూ వివిధ ప్రాంతాల్లో 50 ట్రాప్ కెమెరాలను అమర్చగా, అది సంచరిస్తున్న ఏరియాలకు అనుగుణంగా వీటిని కూడా స్థాన మార్పులు చేస్తూ వాటి వందకు పెంచామన్నారు. అలాగే ఏడు బోనులను ఏర్పాటు చేసి, చిరుతపులిని సురక్షితంగా బంధించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కొంతమంది వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి, భయపడవద్దని, ఆ విధంగా అసత్య ప్రచారాలు చేసే వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారని భరణి హెచ్చరించారు. చిరుత పులిని పట్టుకునేందుకు శాఖాపరంగా చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు.


అడవి పిల్లి పాదముద్రలు

ఎస్‌జీఎఫ్ అండర్- 19 క్రీడాకారుల ఎంపిక

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్- 19 పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపిక పోటీలు రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, షటిల్, కరాటే, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో ఎంపికలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి వచ్చిన రెండు వందల మంది క్రీడాకారుల్లో ఆరు జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు అండర్- 19 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ జంపన రఘురాం తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.వీరన్న అధ్యక్షతన జరిగిన పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఎస్‌జీఎఫ్ అండర్- 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరామకృష్ణ, పీడీలు కె.సతీష్, ఈవీవీ సత్యనారాయణ, రతన్ శామ్యూల్, విశ్రాంత పీడీ ఓలేటి సీతాపతిరావు, గ్రంథాలయాధికారి చక్రధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగంపేటకు చెందిన రావూరి ఏసు (50), అతని భార్య రవణమ్మతో కలసి మండలంలోని ఉప్పలపాడులో ఓ పొలం వద్ద కాపాలాగా ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన ఏసు భార్య కూర వండలేదని గొడవపడి క్రిమిసంహారక మందు తాగాడు. అతనిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అల్లవరంలో..

అల్లవరం: అల్లవరం బసవా మంగాయమ్మ కళ్యాణ మండపం వద్ద ఈ నెల 17న ఓ మోటార్ సైకిల్ ఢీకొని తీవ్ర గాయాలపాలైన చిర్రా నాగేశ్వరరావు (60) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయాన్ని అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

మరో ఘటనలో మహిళ..

అయినవిల్లి: మండలంలోని క్రాప శంకరాయగూడేనికి చెందిన ఓ మహిళ అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్సై కె.మనోహరజోషి తెలిపిన వివరాలు ఇలా.. అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన నక్కా రామలక్ష్మి (63) మానసిక స్థితి సరిగా లేకపోవడంతో చనిపోదామని ఈ నెల 17న గడ్డి మందు తాగింది. రామలక్ష్మిని గమనించిన ఆమె బంధువులు చికిత్స నిమిత్తం అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రత్నగిరి ఉద్యోగులకు నోటీసులు

అన్నవరం: రత్నగిరి దేవస్థానం ఏఈఓ కె.కొండలరావు, సూపరింటెండెంట్ ఐవీ రామారావులు పేకాట ఆడుతూ పోలీసు దాడిలో పట్టుబడ్డారు. తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు ఉన్నందున, వారిద్దరిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని ఈఓ కె.రామచంద్రమోహన్ గురువారం మెమో జారీ చేశారు. పేకాట ఆడుతూ వారు పట్టుబడినట్లు వచ్చిన వార్తలతో దేవస్థానానికి చెడ్డ పేరు వచ్చిందని ఆ మెమోలో పేర్కొన్నారు. వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు.

ముగ్గురిపై హత్యాయత్నం కేసు

అల్లవరం: ఓడలరేవు తీరంలోని సముద్ర రిసార్ట్స్‌లో బుధవారం రాత్రి వంట కుక్ మట్టా దుర్గాప్రసాద్‌పై ముగ్గురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనపై డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ విచారణ చేపట్టారు. గురువారం ఉదయం రిసార్ట్స్‌లో ఘటన జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన సుంకర సురేష్, తోరం రమేష్, తిక్కిరెడ్డి బన్ని రిసార్ట్స్‌లో అద్దెకు రూమ్ తీసుకున్నారని అన్నారు. వారు తీసుకున్న రూమ్ గడువు ముగియడంతో రిసార్ట్స్ నిర్వాహకుడు విలియమ్స్ రూమ్ ఖాళీ చేయమని కోరగా, పైముగ్గురూ విలియమ్స్‌తో ఘర్షణకు దిగారు. దీంతో అక్కడే పనిచేస్తున్న దుర్గాప్రసాద్ వారిని వారించడంతో అందుబాటులో ఉన్న మద్యం సీసాతో దుర్గాప్రసాద్ తలపై కొట్టారు. దీంతో అతనికి తీవ్ర రక్తస్రావం కావడంతో నిర్వాహకులు అమలాపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనలో రమేష్, బన్ని, సురేష్‌లపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట ఎస్సై హరీష్‌కుమార్ ఉన్నారు.


రిసార్ట్స్ వద్ద విచారణ చేస్తున్న డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్

డ్రగ్స్ తయారీ కేసులో మరొకరి అరెస్ట్

నల్లజర్ల: ఘంటావారిగూడెంలో మత్తు మందు అల్ఫ్రోజోలం తయారీ కేసులో మరొకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కొయ్యలగూడేనికి చెందిన పవులూరి శ్రీనివాస్‌ను అతని స్వగ్రామంలోనే అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేశారు. వారిలో స్థల యజమాని తాతిన బాలకృష్ణ, పుల్లలపాడుకు చెందిన పాతూరి సతీష్, హైదరాబాద్‌కు చెందిన డ్రగ్స్ తయారీ నిపుణులు సాంబన జగదీష్, మాకం వెంకటేష్ ఉన్నారు.